కథ

-వాణిశ్రీ

ఎండలు మండిపోతున్నాయి. ఆఫీసుకి వచ్చిన దగ్గర్నుంచి కరెంట్ లేదు. ప్రభుకి చిరాకుగా వుంది. ఫైల్స్ చూడ బుద్ధి కావడంలేదు.

'ఏ.సీ.కి అలవాటు పడితే ఇంతే' అనుకున్నాడు.

ఇక ఇంటికి వెళ్లిపోదామని అనుకుంటూవుండగా అటెండర్ లోపలకు వచ్చి "సార్! సీతారామయ్యట. మిమ్మల్ని చూడాలంటున్నాడు" అన్నాడు.

"ఇప్పుడు ఎవర్నీ చూడను. రేపు రమ్మను" అన్నాడు చిరాకుపడుతూ.

అటెండర్ వెళ్లిపోయాడు.

ప్రభు పట్టణంలో పారిశ్రామికవేత్త. ఇంజనీరింగ్ చదివి ఉద్యోగం నచ్చక స్వంత పరిశ్రమ నెలకొల్పి ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని నిలదొక్కుకున్నాడు. పట్టణంలో పది పరిశ్రమలు నడుపుతూ వెయ్యిమందికి ఉపాధి కల్పించి మంచి పేరు తెచ్చుకున్నాడు.

తను చిన్నతనం నుంచి స్కాలర్‌షిప్పులతో చదువుకున్నాడు. దరిద్రాన్ని జయించాడు. బీదవాళ్లు పైకి రావాలంటే చదువుకోవడమే సరైన మార్గమని నమ్మాడు. అందుకే బీదవాళ్ళు చదువుకోవడానికి స్కాలర్‌షిప్పులు ఏర్పాటుచేశాడు.

ప్రభు దాతృత్వం తెలిసిన బంధుమిత్రులు బీద విద్యార్థులను సహాయం కోసం తీసుకొస్తుంటారు.

ప్రభు ఆఫీసులో నుంచి బైటకు వచ్చి కారు ఎక్కబోతూ వుండగా "నమస్కారం ప్రభుగారూ!" అన్న పిలుపు విని తలెత్తి చూశాడు.

ఆయన సీతారామయ్య. ప్రభుకు బంధువే. ఊళ్లో వ్యవసాయం చేస్తుంటాడు.

"అరే! మామయ్యా మీరా! ఎవరో అనుకున్నాను. చిన్నవాడిని నాకు నమస్కారం చెయ్యడం ఏమిటి? భలేవారే! రండి... రండి!" అని మళ్ళీ ఆఫీసులోకి దారితీశాడు.

సీతారామయ్య పక్కనే ఎవరో ఒక ఆడమనిషి మధ్య వయస్కురాలు, మరొక అమ్మాయి పదహారేళ్ళుంటాయేమో వున్నారు. స్కాలర్‌షిప్ అడగడానికి వచ్చివుంటారని ప్రభుకి అర్థమైంది.

స్కాలర్‌షిప్ కోసం వచ్చిన విద్యార్థిని స్వయంగా ఇంటర్వ్యూ చేసి విషయం తెలుసుకోవడం ప్రభుకి అలవాటు.

ప్రభు ఆఫీసులోకి వెళ్ళి కూర్చున్నాక సీతారామయ్య ఆ అమ్మాయిని లోపలకు తీసుకుని వచ్చాడు.

"రండి మావయ్యా! కూర్చోండి" అన్నాడు.

సీతారామయ్య ప్రభు ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు. ఆ అమ్మాయి ఒక ప్రక్కగా నిల్చుని వుంది.


"ఈ అమ్మాయిది మా వూరే. తండ్రి చనిపోయాడు. పొలం ఏమీలేదు. వీళ్ళమ్మ కూలి పనికి పోతూ నెట్టుకొస్తుంది. ఈ అమ్మాయికి ఒక తమ్ముడు న్నాడు. ఐదోక్లాసు చదువుతున్నాడు"

సీతారామయ్య మాటలకు అడ్డొచ్చిన ప్రభు, "ఈ అమ్మాయి గురించి చెప్పండి" అన్నాడు.

"పదోక్లాసు ప్యాసైంది. పాలిటెక్నిక్‌లో సీటొచ్చింది. హాస్టల్లో వుండి చదువుకోవాలి. మీరు స్కాలర్‌షిప్ ఇస్తే బాగా చదువుతుంది" చెప్పాడు సీతారామయ్య. ప్రభు తలవూపి ఆమెవైపు పరీక్షగా చూశాడు. చామనఛాయ రంగు, ముఖంలో కళ వుంది. పోషణ లేక పీలగా వుంది.

"నీ పేరేమిటి?"

"శాంత"



"టెన్త్‌లో ఎన్ని మార్కులొచ్చాయి"

"మూడు వందల ఎనభైరెండు"

ప్రభు పెదవి విరిచాడు.

"పూర్" అన్నాడు.

ఐదు వందలపైన మార్కులొచ్చిన వాళ్ళంటే ప్రభుకి ఇష్టం. అటువంటివాళ్ళే పై చదువులు బాగా చదువుతారని నమ్ముతాడు. బొటాబొటి మార్కులతో గట్టెక్కినవాళ్ళు చాలా కష్టపడాలి. దానికి ఎంతో శ్రద్ధ, పట్టుదల వుండాలి.

ప్రభు ముఖ కవళికలు గమనించిన సీతారామయ్య "శాంత బాగానే చదువుతుంది. అటెండెన్స్ తక్కువైనాగాని మా వూరి హైస్కూలు హెడ్మాష్టారు పరీక్షలకు పంపించాడు" అన్నాడు.

ప్రభుకి కోపం వచ్చింది. మార్కులు తక్కువ రావ దానికి కారణం అర్థమైంది. ఈ పిల్ల రోజూ స్కూలుకి వెళ్ళదన్నమాట.

"ఐతే నువ్వు రోజూ స్కూలుకి వెళ్ళవా?" సీరియస్‌గా అడిగాడు.

శాంత ఒకసారి ప్రభు వైపు చూసి తల దించుకుంది. సమాధానం చెప్పలేదు.

"మాట్లాడవేం?" రెట్టించాడు.

శాంత సీతారామయ్య వైపు చూసి తలవంచుకుంది. నేల చూపులు చూస్తోంది. ఆమె నోట మాటలు రావడం లేదు.

"రోజూ స్కూలుకెళ్ళి మాష్టార్లు చెప్పే పాఠాలు శ్రద్ధగా వింటే, బుర్రకి ఎక్కించుకుంటే చాలు. తెలివైన పిల్లలు మంచి మార్కులు సాధిస్తారు. నువ్వు అంత ఇంటలిజెంట్ స్టూడెంట్ కాదన్నమాట" అన్నాడు ప్రభు.

శాంత బిక్కముఖం వేసుకుని చూస్తోంది. సీతారామయ్యకి ఆమెను చూస్తే జాలి కలుగుతోంది. శాంతకి అటెండెన్స్ ఎందుకు తక్కువైందో తనకు తెలుసు. ఆమె రోజూ స్కూలుకి ఎందుకు వెళ్ళదో తెలుసు. కాని అదంతా ఆమె ముందు చెప్పడం బాగుండదు అని వూరుకున్నాడు.

ఇటువంటి అమ్మాయికి స్కాలర్‌షిప్ ఇస్తే లాభం లేదు. చదువుమీద అంత కమిట్‌మెంట్ వున్నట్లు లేదు. ఇంటలిజెంట్ స్టూడెంట్‌కి సహాయం చేస్తే ఉపయోగం గాని, శాంతలాంటి అమ్మాయికి ఏం లాభం వుండదు. శాంతకి స్కాలర్‌షిప్ ఇవ్వకూడదనే నిర్ణయానికి వచ్చేశాడు. ఇక ఆ మాట చెప్పడమే తరువాయి.

"శాంతా! నువ్వెళ్ళి మీ అమ్మను పిల్చుకుని రా!" అన్నాడు సీతారామయ్య.

శాంతకి పరిస్థితి అర్థమైంది. తనకి ఈయన స్కాలర్‌షిప్ ఇవ్వడు అనుకుంది. ఆమెకి దుఃఖం ముంచుకొచ్చింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఏడుపు ఆపుకుంటూ బైటకు వెళ్ళిపోయింది.

"సారీ మావయ్యా! రోజూ స్కూలుకు వెళ్ళనివాళ్ళకి నేను స్కాలర్‌షిప్ ఇవ్వలేను" అన్నాడు ప్రభు.

సీతారామయ్య ఏదో చెప్పబోయాడు.

"డబ్బు లేకపోతే అది వేరే విషయం. రోజూ స్కూలుకి వెళ్ళకపోతే ఎలా? ఇక ఈ అమ్మాయికి చదువుమీద ఏమంత శ్రద్ధ వున్నట్లు?" అన్నాడు ప్రభు.

"శాంతకి చదువుమీద శ్రద్ధ వుంది. కాని రోజూ స్కూలుకి వెళ్ళే పరిస్థితి లేదు" అన్నాడు సీతారామయ్య.

"అదేం?"

"రోజూ స్కూలుకి ఎందుకు వెళ్ళడంలేదని వాళ్ళమ్మ ముందు మళ్ళీ అడగవద్దు. నేను చెప్తాను. ఆ అమ్మాయి బాధ పడుతుందని ఇందాక ఆమె ముందు చెప్పలేకపోయాను. స్కూలుకి వెళ్ళడానికి శాంతకి ఒక జత బట్టలు మాత్రమే వున్నాయి. అవే వుతుక్కుని వెళ్ళాలి. పాపం ఏం చేస్తుంది? అప్పుడప్పుడు, అంటే వారానికి ఒకటి రెండు రోజులు స్కూలు మానేసి వుతుక్కోవాల్సివస్తుంది" చెప్పాడు సీతారామయ్య.

ప్రభు అవాక్కయ్యాడు. బీదవారికి ఇటువంటి సమస్యలు కూడా వుంటాయా? తను వినడం ఇదే మొదటిసారి. తను స్కూలుకి ఎందుకు రెగ్యులర్‌గా వెళ్ళడం లేదని అడిగితే ఆ అమ్మాయి గొంతు పెగలక పోవడానికి ఇదా కారణం? దారుణం అనిపించింది.

పూరి గుడిసెలో నివాసం. ఇంట్లో కరెంటు లేదు. గుడ్డిదీపం వెలుగులో చదువు. కడుపునిండా తినడానికి అన్నంలేదు. కట్టుకోవడానికి బట్టలు కరువు. ఐనా తను చదువుకోవాలనే దృఢసంకల్పంతో వుంది శాంత.

సీతారామయ్య ఆ తల్లీ కూతుళ్ళ దీనావస్థ కళ్ళకు కట్టినట్లు వివరిస్తుంటే చలించిపోయాడు ప్రభు.

ఇంతలో శాంత తల్లిని వెంటబెట్టుకుని వచ్చింది.

"శాంతా! నీకు స్కాలర్‌షిప్ మంజూరు చేస్తున్నాను. పాలిటెక్నిక్ చదువు పూర్తయిన తర్వాత నిన్ను ఇంజనీరింగ్ కూడా చదివిస్తాను" అన్నాడు ప్రభు.

శాంత ముఖంలోకి వెలుగొచ్చింది. ఆమె కళ్ళు సంతోషంతో మిలమిలలాడాయి. ఆనందంతో పొంగిపోతూ ఆమె ప్రభు కాళ్ళకు మొక్కింది.

"లే.. లే.. నువ్వు బాగా చదివి మంచి ఉద్యోగం సంపాదించుకోవాలి. మీ వూరికి మంచి పేరు తీసుకురావాలి. నీకు వచ్చిన అవకాశం ఉపయోగించుకుని దరిద్రాన్ని జయించాలనే పట్టుదలతో వుండాలి" అని ఆమె భుజం తట్టి ఆశీర్వదించాడు ప్రభు.

"అయ్యా! మీరు దేవుడిలాంటోడు" శాంత తల్లి రెండు చేతులూ జోడించి అన్నది.

"అటువంటి మాటలు వద్దమ్మా! నేనూ ఒకరు సహాయం చేస్తేనే చదువుకుని పైకి వచ్చాను. అది గుర్తుంచుకుని మరొకరికి సహాయం చేస్తున్నాను" అన్నాడు ప్రభు.

"సీతారామయ్యగారు మా అమ్మాయికి మీ ద్వారా ఒక దారి చూపించాడయ్యా!" అన్నది శాంత తల్లి.

"నాదేవుందమ్మా! ప్రభు సంగతి తెలిసినవాడిని కాబట్టి మాట సాయం చేశాను. అంతే" అన్నాడు సీతారామయ్య.

"శాంతా! ఇప్పుడు నీకొక విషయం చెప్తాను. గుర్తుంచుకో. నేను స్కూల్లో చదువుతున్నప్పుడు పరీక్ష ఫీజు పదహారు రూపాయలు కట్టలేకపోతే, ఒక మహానుభావుడు సహాయం చేశాడు. ఆ తర్వాత దాతల స్కాలర్‌షిప్పులతోనే ఇంజనీరింగ్ వరకు చదువుకున్నాను. అది జీవితాంతం గుర్తుంచుకుంటాను. అందుకే చదువుకునేవారికి సహాయం చేస్తున్నాను. రేపు నువ్వు కూడా జీవితంలో నిలదొక్కుకున్నాక కనీసం ఒక బీద విద్యార్థికైనా ఆర్థిక సహాయం చేయాలి. ఇది నా అభ్యర్థనైనా అనుకో, కండిషన్ అనైనా అనుకో" అన్నాడు ప్రభు.

"నాకు వీలైతే పదిమందినైనా చదివిస్తాను సార్!" అన్నది శాంత.

"గుడ్..." అని వెళ్ళిపోయి కారెక్కాడు ప్రభు.

"దైవం మానుష రూపేణా!... అంటే దేవుడు ఎక్కడో వుండదు. మనిషిలోనే ఉంటాడు. అందుకే అనాది నుండి దేవుడిని తన రూపంలో ప్రతిష్టించి పూజిస్తున్నాడు మనిషి"

గుడిలో నుంచి మైక్‌లో ప్రవచనాలు వినిపిస్తున్నాయి.

"శాంతా! ప్రభు ఇప్పుడు నీకిస్తున్న స్కాలర్‌షిప్ సహాయం అనుకోకు. ఋణం అనుకో. నువ్వు సంపాదనాపరురాలైన తర్వాత బీద విద్యార్థికి ఆ ఋణం చెల్లించు" చెప్పాడు సీతారామయ్య.

శాంత తల వూపింది.

★

